సాక్షి
మెదక్
గురువారం । 12 । సెప్టెంబర్ । 2024



ఎన్నాళ్లీ శోకం..

ఉపాధి కోసం విదేశాలకు వెళ్తున్న వలస కూలీల బతుకులు కుళ్లిపోతున్నాయి. కనీసం చివరి చూపు దక్కని పరిస్థితి ఏర్పడింది.

వివరాలు 8లో ▸



కక్ష తీర్చుకోవడానికే హైడ్రా

హైడ్రా విషయంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం న్యాయంగా వ్యవహరించాలని ఎంపీ డీకే అరుణ అన్నారు.

వివరాలు 8లో ▸



బంతి సాగు.. దిగుబడి బాగు

కూరగాయల సాగులో అంతర పంటగా బంతిపూల తోట సాగు చేస్తూ రైతులు లాభాలు గడిస్తున్నారు.

వివరాలు 9లో ▸

పంటల రక్షణకై రేపు సాక్షి ఫోన్ ఇన్..

జిల్లా వ్యవసాయాధికారి సూచనలు, సలహాలు

మెదక్‌జోన్: ఇటీవల కురిసిన అధిక వర్షాలతో పంటలు చాలా వరకు దెబ్బతినే అవకాశం ఉంది. పంటల రక్షణ కోసం రైతులు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, సూచనలు, సలహాలకై శుక్రవారం 'సాక్షి' ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్‌తో ఫోన్ ఇన్ కార్యక్రమం చేపడుతుంది.





తేదీ: 13.09.2024 (శుక్రవారం)
సమయం: ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్:
72888 94450

న్యూస్‌రీల్

సభ్యత్వ నమోదులో సత్తా చాటాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్

మెదక్‌జోన్: ప్రతి కార్యకర్త సభ్యత్వ నమోదును ఉద్యమంలా చేయించాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం మెదక్‌లోని టీఎన్‌జీఓ బవన్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ అధ్యక్షతన చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలన్నారు. మోదీ సారథ్యంలోని ప్రభుత్వానికి మనం చేసే సభ్యత్వ నమోదుతో మరింత బలం చేకూరుతుందని అన్నారు. అనంతరం రాష్ట్ర నాయకుడు మురళీగౌడ్ మాట్లాడుతూ.. ప్రపంచమంతా భారతదేశం వైపు చూస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్షా 33 వేల మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న డీఆర్డీఓ పీడీ శ్రీనివాసరావు తదితరులు

చేగుంట(తూప్రాన్): జిల్లాలో మహిళా సంఘాల సభ్యులు లక్షా 33 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు డీఆర్డీఓ పీడీ శ్రీనివాసరావు అన్నారు. చేగుంట ఐకేపీ కార్యాలయంలో మహిళా సంఘాలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు పలు రకాల వ్యాపారాలు నిర్వహించుకోవడానికి రూ. లక్ష నుంచి 5 లక్షల వరకు మహిళా శక్తి పేరుతో రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లించాలని కోరారు. అనంతరం పోతాన్‌శెట్టిపల్లిలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీపీఎం ప్రకాశ్, ఏపీఎం లక్ష్మీనర్సమ్మ, మహిళా సంఘాల గ్రామశాఖ అధ్యక్షులు, సీసీలు పాల్గొన్నారు.

ఉపాధిపై కేంద్ర బృందం పర్యవేక్షణ



సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

పెద్దశంకరంపేట(మెదక్): ఉపాధి హామీ పనులపై ఈనెల 18వ తేదీ నుంచి 15 రోజుల పాటు కేంద్ర జనరల్ ఆడిటింగ్ బృందం పర్యవేక్షణ చేయనున్నట్లు సీనియర్ ఆడిటర్ మాల కొండయ్య తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్, ఈజీఎస్ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2019- 2024 వరకు చీలాపల్లి, టెంకటి, ఆరేపల్లి, ముసాపేట గ్రామాల్లో చేపట్టిన ఈజీఎస్ పనులతో పాటు పంచాయతీరాజ్ సీసీ రోడ్లపై కేంద్ర బృందం పరిశీలన చేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తుందన్నారు. సిబ్బంది అందుబాటులో ఉండి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా, ఆడిటింగ్ సిబ్బంది ఏపీఓలు మహిపాల్‌రెడ్డి, నవాజుద్దీన్, టీఏలు తదితరులు పాల్గొన్నారు.

మాఫీ కావాలంటే.. సెల్ఫీ దిగాల్సిందే..!

రైతు కుటుంబసభ్యుల సెల్ఫీ ఫొటోను యాప్‌లో అప్‌లోడ్

- సభ్యులంతా లేకపోతే కుటుంబ పెద్ద తప్పనిసరి..
- ఇది మా కుటుంబం అంటూ అఫిడవిట్ కూడా ఇవ్వాలి
- కొనసాగుతున్న రుణమాఫీ కుటుంబ నిర్ధారణ ప్రక్రియ



సదాశివపేట: నిజాంపూర్‌లో ఫ్యామిలీ గ్రూపింగ్ కోసం సెల్ఫీ తీస్తున్న ఏఓ రమేశ్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: అన్ని అర్హతలున్నప్పటికీ రేషన్‌కార్డు లేని కారణంగా రుణమాఫీ కాని రైతుల కుటుంబాల నిర్ధారణ (ఫ్యామిలీ గ్రూపింగ్) ప్రక్రియ కొనసాగుతోంది. మండల వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లోకి వెళ్లి ఆయా రైతుల కుటుంబాలను నిర్ధారణ చేస్తున్నారు. ఇందుకోసం సదరు రైతు కుటుంబ సభ్యులంతా కలిసి ఓ సెల్ఫీ ఫొటో దిగాల్సి ఉంటోంది. ఈ సెల్ఫీ ఫొటోను అధికారులు వ్యవసాయ శాఖ ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. అలాగే తమ కుటుంబసభ్యుల వివరాలతో కూడిన అఫిడవిట్‌ను కూడా రైతుల నుంచి తీసుకుంటున్నారు. ఈ అఫిడవిట్‌ను కూడా అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ సెల్ఫీ ఫొటోలో కుటుంబ సభ్యులంతా ఉండాలి. లేనిపక్షంలో కనీసం కుటుంబపెద్ద తప్పనిసరి చేశారు. రైతు కుటుంబ పెద్దలు చాలా మంది స్థానికంగా ఉండటం లేదు. ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు తమ గ్రామానికి వచ్చి ఈ సెల్ఫీ ఫొటోలు, అఫిడవిట్‌లు ఇవ్వాల్సి వస్తోంది. ఈ ప్రక్రియను మండల వ్యవసాయ అధికారులు గ్రామాలకు వెళ్లి చేపట్టారు.

40 శాతం మందికి కాని రుణమాఫీ..

రాష్ట్ర ప్రభుత్వం రైతుల పంట రుణాలను మాఫీని ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విషయం విదితమే. ఒక్కో రైతు కుటుంబంలో రూ.2లక్షల మేరకు పంట రుణాలను మాఫీ చేస్తోంది. రూ.లక్ష లోపు పంట రుణమున్న రైతులకు తొలి విడతలో, రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర లోపు రుణమున్న రైతుల రుణాలను రెండో విడతలో, రూ. లక్షన్నర నుంచి రూ.రెండు లక్షల లోపు ఉన్న పంట రుణాలను మూడో విడతలో మాఫీ చేసింది. అనేక కారణాల వల్ల జిల్లాలో వేలాది మంది రైతుల పంట రుణాలు మాఫీ కాలేదు. మాఫీ వర్తించని సుమారు 35కు పైగా కారణాల్లో ఈ రేషన్‌కార్డు లేని కారణంగా వేలాది మంది రైతులకు మాఫీ వర్తించలేదు. ఇలా కుటుంబ నిర్ధారణ కాని రైతు కుటుంబాల నిర్ధారణ ప్రక్రియ ఇప్పుడు కొనసాగుతోంది. ఇలా కుటుంబ నిర్ధారణ జరగని రైతుల జాబితాను వ్యవసాయశాఖ బ్యాంకర్ల నుంచి సేకరించి మండల వ్యవసాయ అధికారులకు పంపింది. ఈ జాబితా ప్రకారం ఈ కుటుంబనిర్ధారణ ప్రక్రియ కొనసాగుతోంది.

ఉమ్మడి జిల్లాలో ప్రక్రియ ఇలా

జిల్లా	ఫ్యామిలీ గ్రూపింగ్ చేయాల్సిన దరఖాస్తులు	గ్రూపింగ్ పూర్తి చేసిన దరఖాస్తులు
సంగారెడ్డి	18,870	12,056
మెదక్	12,173	5,654
సిద్దిపేట	18,000 (సుమారు)	8,000 (సుమారు)

కుటుంబపెద్ద విదేశాల్లో ఉంటే..

చాలా రైతు కుటుంబాల్లోని కుటుంబపెద్దలు విదేశాల్లో ఉన్నారు. వారి కుటుంబసభ్యులు ఇక్కడ తమ భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్నారు. ఇలా విదేశాల్లో ఉన్న రైతులకు సంబంధించిన వారి వివరాల జోలికి అధికారులు వెళ్లడం లేదు. ఈ జాబితాను ప్రస్తుతం పక్కన బెట్టారు. హైదరాబాద్ వంటి నగరాల్లో ఉంటున్న రైతు కుటుంబపెద్దలు తమ స్వగ్రామాలకు వచ్చి సెల్ఫీ ఫొటోలు దిగి, అఫిడవిట్‌లు ఇస్తున్నారు. పక్షం రోజులుగా ఈ నిర్ధారణ కొనసాగుతోంది. నిర్దిష్ట షెడ్యూల్ మేరకు గ్రామాలకు వెళ్లి ఈ ప్రక్రియను చేస్తున్నారు. ఈనెల 6 వరకు ఈ పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నాయి. కానీ ఈ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో గడువును ప్రభుత్వం పొడిగించింది.

వేగవంతం చేస్తున్నాం

అన్ని అర్హతలు ఉన్నప్పటికీ రుణమాఫీ కాని రైతులకు సంబంధించి ఫ్యామిలీ గ్రూపింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నాం. ఇప్పటికే సుమారు 60 శాతానికి మించి ఈ ప్రక్రియ పూర్తయింది. మిగిలిన దరఖాస్తులను కూడా వీలైనంత త్వరగా పూర్తి చేస్తాం. ప్రత్యేక యాప్‌లో ఈ వివరాలను నమోదు చేస్తున్నాం.

– శివప్రసాద్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

డీజిల్ పోయలేం.. ఖర్చు భరించలేం

పంచాయతీ కార్యదర్శుల ఆవేదన



మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): 'ఇన్ని రోజులు ఎలాగో ఖర్చు భరిస్తూ పంచాయతీలో అన్ని పనులు చేశాం. ఇక ట్రాక్టర్‌లో డీజిల్ పోయలేం.. ఖర్చులు భరించలేం తమకు ఖర్చుతో కూడుకున్న పనులు చెప్పవద్దని' పంచాయతీ కార్యదర్శులు అధికారులకు మొరపెట్టుకున్నారు. బుధవారం కౌడిపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ కలీముల్ల కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిశీలించి విచారణ చేయాలన్నారు. పారిశుద్ధ్యం, మంచినీటి సమస్య లేకుండా పనులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం మాజీ అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, ఇతరులు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల్లో నిధులు లేవని, పనులు చేయలేమని తేల్చిచెప్పారు. ఇప్పటివరకు చాలా ఖర్చుచేశామని, బిల్లులు ఇప్పటికీ రాలేదన్నారు. ట్రాక్టర్‌లో చెత్త సేకరణకు డీజిల్ సైతం పోయలేమని అన్నారు. ఇప్పటివరకు చేసిన ఖర్చుల వివరాలు రిజిస్టర్‌లో రాశామని చూడాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీఓ వద్ద పంచాయతీ కార్యదర్శులతో పాటు స్పెషల్ ఆఫీసర్ డిజిటల్ కీ ఉంచుకొని నిధులు డ్రా చేయకుండా వేధిస్తున్నారని పలువురు వాపోయారు. ఉన్న నిధులు సైతం డ్రా చేయలేని పరిస్థితి ఉందన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం

హవేళిఘణాపూర్(మెదక్): చదువుతో పాటు క్రీడలూ అవసరమని డీఈఓ రాధాకిషన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఎస్‌జీఎఫ్ క్రీడలు నిర్వహించగా డీఈఓ ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, విద్యార్థులందరూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. రాష్ట్రస్థాయిలో రాణించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ నీలకంఠం, హెచ్ఎం కరుణాకర్, మండల నోడల్ అధికారి మధుమోహన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈఓ రాధాకిషన్

పూర్తయిన విచారణ



పెట్రోల్ బంక్‌లో కొలతలు తీస్తున్న అధికారులు

టేక్మాల్ (మెదక్): టేక్మాల్ పీఏసీఎస్ చైర్మన్ యశ్వంత్‌రెడ్డి, సీఈఓ వేణుగోపాల్ సహకార సంఘంలో అవినీతికి పాల్పడ్డారని డైరెక్టర్లు చేసిన ఫిర్యాదు మేరకు బుధవారం మెదక్ ఆర్డీఓ రమాదేవి విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా మండలంలోని ధనూర పెట్రోల్ బంకులో పెట్రోల్, డీజిల్ ఎంత మేరకు నిల్వ ఉందో కొలతలు నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో సహకార సంఘానికి సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ పూర్తయిందని, పూర్తి నివేదిక సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఆమె వెంట డీసీఓ కరుణ, తహసీల్దార్ తులసీరాం, ఆర్ఐ సాయి శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఉద్యోగులకు న్యాయం చేయాలి

కొల్చారం(నర్సాపూర్): జిల్లాలోని 117 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కొంగోడ్, అంసాన్‌పల్లి, వరిగుంతం, కొల్చారం, సంగాయిపేట రంగంపేట సందర్శించి సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఖాళీ స్థానంలో విద్యా వలంటీర్లను నియమించడంతో పాటు పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ యాదగిరి, రాష్ట్ర కౌన్సిలర్ సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి నజీరుద్దీన్, సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు సభ్యత్వం అందజేస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

అభివృద్ధిని చేతల్లో చూపుతాం



మెడికల్ కళాశాలకు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు తదితరులు

- మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు
- మెడికల్ కళాశాల మంజూరుపై హర్షం

మెదక్‌జోన్: మాటల్లో కాకుండా అభివృద్ధిని చేతల్లో చేసి చూపుతామని, మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే మెడికల్ కళాశాలను మంజూరు చేసిందని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. బుధవారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం భవనం కోసం పిల్లికోటాల్ శివారులో కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. కళాశాల మంజూరు కోసం కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా నిర్మించే మెడికల్ కళాశాల భవనంలో మెడికల్, నర్సింగ్ కళాశాలలు ఒకే ప్రాంగణంలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. ఇక నుంచి వైద్యం మరింత చేరువ అవుతుందని, జిల్లాలో యువత డాక్టర్ చదువుపై ఆసక్తి చూపుతారన్నారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ.. ప్రత్యేక జిల్లాగా ఏర్పడినా మెదక్ అభివృద్ధి చెందలేదన్నారు. జిల్లా అభివృద్ధిలో విద్య, వైద్య సౌకర్యాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని చెప్పారు. అంతకుముందు మెదక్ పట్టణంలో కాంగ్రెస్ శ్రేణులు సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ శివదయాల్, తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిలో పదేళ్లు వెనుకకు..

రామాయంపేట(మెదక్): ప్రగతిలో మెదక్ నియోజకవర్గం పదేళ్లు వెనుకకు పోయిందని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు వాపోయారు. బుధవారం రామాయంపేటలో కల్యాణలక్ష్మి చెక్కులు అందజేయడంతో పాటు కోనాపూర్, ప్రగతి ధర్మారం గ్రామాల్లో కుట్టు శిక్షణా కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదన్నారు. మెదక్‌కు మెడికల్ కాలేజీ మంజూరు విషయమై గత పాలకులు ప్రజలను మోసగించారని, తాము మంజూరు చేయించామని అన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే క్రీడోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విజయలక్ష్మి, పీసీసీ కార్యదర్శి సుప్రభాత రావు, పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి రామచందర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, కౌన్సిలర్లు యాదగిరి, గంగాధర్, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కలెక్టర్ పాఠాలు



కేజీబీవీలో పాఠాలు బోధిస్తున్న రాహుల్‌రాజ్

పాపన్నపేట(మెదక్): ప్రభుత్వ పాఠశాలల్లోనే పరిపూర్ణ వికాసం లభిస్తుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం కేజీబీవీ బాలికల పాఠశాలను సందర్శించారు. టీచర్‌గా మారి విద్యార్థినులకు పాఠాలు బోధించారు. గణితం, ఫిజిక్స్, సైన్స్ తదితర సబ్జెక్టుల్లో విద్యార్థినుల సామర్థ్యాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిపుణులైన టీచర్లు ఉంటారని చెప్పారు. బడి మానేసిన బాలికల కోసం ప్రత్యేకంగా కేజీబీవీలు ఏర్పాటు చేశారన్నారు. పోషకాహారం, ఆటపాటలతో ఒత్తిడి లేని చదువును అందిస్తున్నాయని తెలిపారు. పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థినులకు చెప్పారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున టీచర్లు పారిశుద్ధ్యంపై తగిన శ్రద్ధ వహించాలని కోరారు. సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని టీచర్లకు సూచించారు. వంటశాలలో వంటలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాపన్నపేట, పొడిచన్‌పల్లి పీహెచ్‌సీలను సందర్శించి రోగులతో మాట్లాడారు. జ్వరాలను అశ్రద్ధ చేయొద్దని రక్త పరీక్షలు చేసి వ్యాధుల నిర్ధారణ చేయాలన్నారు. 24 గంటలు అందుబాటులో ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.

మెదక్- మెటల్‌కుంట రోడ్డుపై కేంద్రం ఆరా

పాపన్నపేట(మెదక్): మెదక్- మెటల్‌కుంట రోడ్డును జాతీయ రహదారిగా మార్చాలన్న డిమాండ్‌కు ప్రతిస్పందన లభించిందని జోగిపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగ జోగినాథ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. మెదక్ నుంచి బొడమట్‌పల్లి వరకు ఉన్న రోడ్డును జాతీయ రహదారిగా మార్చాలని కోరుతూ మెదక్ ఎంపీ రఘునందన్‌రావుతో పాటు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం సమర్పించామన్నారు. ఈ విషయమై ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి తనకు ఫోన్ వచ్చిందన్నారు. అనంతరం ఈ రోడ్డును జాతీయ రహదారిగా మార్చేందుకు అవసరమైన సమాచారం ఇవ్వాల్సిందిగా రాష్ట్ర నేషనల్ హైవే ఈఎన్‌సీకి ఆదేశాలు జారీ చేశారని వివరించారు. ఇందుకు సహకరిస్తున్న కేంద్ర మంత్రుల కిషన్‌రెడ్డి, సంజయ్, రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీలు రఘునందన్ రావు, సురేష్ షెట్కార్, మాజీ ఎంపీ బీబీపాటిల్‌కు ధన్యవాదాలు తెలిపారు.

తెగులు.. దిగులు

వరిలో ఉల్లికోడు | **దిగుబడిపై తీవ్ర ప్రభావం**



ఉల్లికోడు సోకిన వరి పొలం.. గొట్టాలుగా మారిన వరి కంకులు

మెదక్ జోన్: ఆలస్యంగా సాగు చేసిన వేలాది ఎకరాల వరిపై ఉల్లికోడు తెగులు సోకింది. పిలకలు పెట్టాల్సిన వరి కంకులు గొట్టాలు పెడుతున్నాయి. రూ. వేల పెట్టుబడి పెట్టి వరి సాగు చేస్తే చేతికందే సమయంలో మాయదారి తెగుళ్ల పంటను నాశనం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

85 వేల ఎకరాల్లో ప్రభావం

ఈ వానాకాలం సీజన్‌లో 2.65 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా జూలై వరకు 1.80 లక్షల ఎకరాల్లో నాట్లు వేశారు. ఆగస్టులో వర్షాలు సమృద్ధిగా పడిన తర్వాత మరో 85 వేల ఎకరాల్లో వరి సాగు అయినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఆలస్యంగా వేసిన నాట్లలో ఈ ఉల్లికోడు ప్రభావం తీవ్రంగా ఉంది. ఇప్పటికే 40శాతం పంట దెబ్బతింది. ఫలితంగా పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నివారణ కోసం రైతులు వారికి తోచిన మందులు పిచికారీ చేస్తున్నారు. అయినా కంట్రోల్ కావడం లేదని వాపోతున్నారు.

లేటుగా వేసిన పొలంలోనే..



నాకు మూడెకరాల పొలం ఉంది. అందులో ఎకరంన్నరలో జూలైలో నాటు వేశాను. అది బాగుంది. మరో చోట ఎకరంన్నరలో రెండు నెలల తూకం నాటు వేశాను. అందులో అంతా ఉల్లికోడు వచ్చి సగం పంట దెబ్బతింది. మందులు పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోయింది. పెట్టుబడి కూడా వచ్చే అవకాశం కనిపించడం లేదు.

– యాదగిరి, రైతు జంగరాయి

ముందుగా గుర్తిస్తే మేలు



జిల్లాలో ఆలస్యంగా సాగు చేసిన వరిలో ఉల్లికోడు తెగులు సోకింది. దీన్ని ముందుగా గుర్తించి ఎకరాకు 10 కిలోల చొప్పున త్రీజీ, టెన్‌జీ, గులికలు లేదా కార్బోసల్ఫాన్ మందును పిచికారీ చేయాలి. ఇప్పటికే పిలకలకు బదులు గొట్టాలుగా వచ్చిన వారు ఈ పని చేస్తే ఆగిపోతుంది.

– గోవింద్, జిల్లా వ్యవసాయ అధికారి

క్లుప్తంగా

14న అథ్లెటిక్స్ ఎంపికలు

సిద్దిపేటజోన్: సిద్దిపేట స్టేడియంలో ఈనెల 14న అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక ఉంటుందని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శి వెంకట్ స్వామి పేర్కొన్నారు. ఈ నెల 19, 20 తేదీల్లో హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో జరగనున్న రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్స్ టోర్నీలో పాల్గొనే వారిని సిద్దిపేట జిల్లా నుంచి ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. అండర్ 14,16,18,20 విభాగాల్లో బాల బాలికలకు వేర్వేరుగా ఎంపిక ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు. పదవ తరగతి మెమో, పుట్టిన తేదీకి సంబంధించిన పత్రాలతో ఈనెల 13న సాయంత్రం 6 గంటలకు జిల్లా అథ్లెటిక్స్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 85019 77079, 96660 20322, 97040 61543 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

దుబ్బాకటౌన్ : రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి సుశాంత్ ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ గోవర్ధన్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. 13 నుంచి 15వ తేదీల్లో హైద్రాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ పోటీలకు సుశాంత్ ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

మెడ్విన్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి


మాట్లాడుతున్న మధుసూదన్ రెడ్డి

సంగారెడ్డి: కార్మికులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మెడ్విన్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఇళ్లలో పని చేస్తున్న గృహ కార్మికులకు నాయకత్వ లక్షణాలు, గృహ హింస, కార్మిక హక్కులపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తోటి వారి సమస్యలను తమ సమస్యలుగా భావించి స్పందించాలని, అవసరమైన సహాయం అందించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డొమెస్టిక్ వర్కర్స్, నాయకులు, మెడ్విన్ కోఆర్డినేటర్ స్వప్న, పార్కర్ కో ఆర్డినేటర్ హాఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్య

పటాన్‌చెరుటౌన్: ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన రాజ్ కుమార్ బతుకుదెరువు కోసం 13 ఏళ్ల కిందట గుమ్మడిదల మండలం దోమడు గ్రామానికి వచ్చి నివాసం ఉంటున్నాడు. స్థానికంగా ఓ పరిశ్రమలో ఆపరేటర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పెద్ద కుమారుడు అంకిత్ కుమార్(19) స్వగ్రామమైన బీహార్‌లో ఓ అమ్మాయిని ప్రేమించాడు. పది రోజుల కింత తండ్రి వద్దకు దోమడుగు వచ్చాడు. బుధవారం తండ్రి డ్యూటీకి వెళ్లగా ఇంటి వద్ద ఉన్న అంకిత్ కుమార్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. తమ కుమారుడు ప్రేమ విఫలమై, మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని రాజ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వరి పొలానికి మందు పిచికారీ చేస్తుండగా..

అస్వస్థతకు గురై యువ రైతు

తూప్రాన్: అస్వస్థతకు గురై యువ రైతు మృతి చెందిన ఘటన మండలంలోని ఇమాంపూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం కథనం మేరకు.. గ్రామానికి చెందిన శీల శ్రీనివాస్(35) అనే యువరైతు వరి పంటకు పురుగుల మందు పిచికారీ చేస్తున్నాడు. ఈ క్రమంలో అస్వస్థతకు గురై కింద పడిపోయాడు. స్నేహితుడు రాజేశ్ గుర్తించి కుటుంబ సభ్యులు సమాచారం అందించి, వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. భార్య కవిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కుళ్లుతున్న శవం.. ఎన్నాళ్లీ శోకం

దుబాయ్‌లో చనిపోతున్న వలస కూలీలు
- రోజుల తరబడి స్వగ్రామానికి రాని మృతదేహాలు
- చివరి చూపు కోసం కుటుంబికుల ఎదురుచూపులు
- ఒక్క ఆగస్టు నెలలోనే ఇద్దరు మృతి
- మెదక్ జిల్లాలో విషాదకర ఘటనలు




అప్పులు తీర్చేందుకు..

మెదక్‌జోన్/హవేళిఘణాపూర్: ఉపాధి కోసం విదేశాలకు వెళ్తున్న వలస కూలీల బతుకులు కుళ్లిపోతున్నాయి. కుటుంబ పోషణకు.. పిల్లల పెళ్లిలకు, అప్పులు తీర్చడానికి, మరే ఇతర అవసరాల కోసమే స్వగ్రామాన్ని, కుటుంబాన్ని వదిలి గల్ఫ్‌దేశాల బాట పడుతున్నారు. ఈ క్రమంలోనే అక్కడ పని చేస్తూ అనారోగ్యానికి గురి కావడం.. లేదా వివిధ ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. కుటుంబ సభ్యులకూ తీరని విషాదాన్ని మిగుల్చుతున్నారు. కొందరికి చివరి చూపు కూడా దక్కని పరిస్థితి. వారి మృతదేహాలను స్వగ్రామాలకు తీసుకొచ్చేందుకు నానా తంటాలు పడుతున్నారు. నెలల కొద్ది శవాలు ఇక్కడికి రాక కుళ్లిపోతున్నాయి.

మెదక్ మండలం రాజ్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని తిమ్మక్కపల్లి తండాకు చెందిన రాట్ల సూర్యకు గుంట భూమి లేదు. చిన్నపాటి పూరి గుడిసెలో భార్య సరిత, ఇద్దరు పిల్లలతో ఉండేవాడు. సూర్య తన బంధువులతో పాటు తనకు తెలిసిన చోటా అప్పుచేసి 8 పాడి గేదెలు కొనుగోలు చేశాడు. వాటిని పోషిస్తూ పాలు అమ్ముకొని ఉన్న దాంట్లో జీవనం సాగించేది. కరోనా సమయంలో పాడి గేదెలకు ఏదో వ్యాధి సోకి చనిపోయాయి. దీంతో సూర్య అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చేందుకు ఇక్కడ మార్గం కానరాక మరో రూ.లక్ష అప్పు చేసి కామారెడ్డికి చెందిన ఓ ఏజెంట్ సాయంతో ఆగస్టు 6న దుబాయ్‌కి వెళ్లాడు. అదే నెల 12న చనిపోయినట్లు ఏజెంట్ ఫోన్ ద్వారా చెప్పాడు. మృతికి గల కారణాలు మాత్రం తెలియదు.

మా నాన్న శవం తెప్పించండి సారూ...



సూర్యం ఇద్దరు కుమారులు రామాయంపేటలోని ఓ హాస్టల్‌లో ఉంటూ పెద్దవాడు 8వ, చిన్న వాడు 7వ తరగతి చదువుకుంటున్నారు. తండ్రి చనిపోయిన విషయం తెలుసుకున్న వారు బడి మానేసి తల్లితో పాటు దుఃఖిస్తున్నారు. సూర్య మృతి చెందిన విషయం తెలుసుకొని వివరాల కోసం గ్రామానికి వెళ్లగా మా నాన్న శవం తెప్పించండి సారూ అంటూ కుమారులు సందీప్, రంజిత్‌లు చేతుల జోడించి ఏడ్చిన తీరు అందరినీ కంట తడిపెట్టించింది.

చనిపోయి నెల రోజులు..



హవేళిఘణాపూర్ మండలం సుల్తాన్‌పూర్ తండాకు చెందిన వసురామ్‌కు 8 గుంటల భూమి ఉంది. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కూలీ పనులు చేస్తూ జీవించేవాడు. కుటుంబ పోషణ ఇతర అవసరాల కోసం చేసిన రూ.3 లక్షలు అప్పులు చేశాడు. ఆయన పెద్ద కూతురు పెళ్లీడుకొచ్చింది. దుబాయ్ వెళ్లి డబ్బులు సంపాదించి తెస్తానని ఆగస్టు నెల 9న నిజామాబాద్‌కు చెందిన ఏజెంట్ ద్వారా వెళ్లాడు. అదే నెల 11న మృతి చెందాడని ఏజెంట్ ద్వారా సమాచారం అందింది. ఎలా చనిపోయాడన్న విషయం మాత్రం తెలియదు. చనిపోయి నెల రోజులు అవుతుండటంతో మృతుడి భార్య అనితతో పాటు ముగ్గురు పిల్లలు మృతదేహాన్ని తెప్పించాలని వేడుకుంటున్నారు.

మరికొన్ని ఘటనలు..

- హవేళిఘణాపూర్ మండల కేంద్రానికి చెందిన మూగలక్ష్మయ్య ఐదేళ్ల కిందట దుబాయ్‌కి వలస వెళ్లి ఏదో కారణంతో చనిపోగా మృతదేహాన్ని 2 నెలలకు ఇండియాకు తెప్పించారు.
- ఇదే మండలం శమ్నాపూర్ గ్రామానికి చెందిన జాల లక్ష్మయ్య ఆరేళ్ల కిందట దుబాయ్‌కి వెళ్లి చనిపోయాడు. అతడు చనిపోయాక 15 రోజులకు మృతదేహం స్వగ్రామానికి వచ్చింది.
- ఇదే మండలం బూర్గుపల్లి గ్రామానికి చెందిన జంగం శేఖర్ మూడేళ్ల కిందట దుబాయ్‌లో చనిపోయారు.
- అదే గ్రామానికి చెందిన ప్రేమ్ అనే వ్యక్తి ఆరేళ్ల కిందట దుబామ్ వెళ్లిన కేవలం 6 మాసాలకే ఆత్మహత్య చేసుకున్నాడు.
- ఇలా చాలా మంది డబ్బులు సంపాదించాలని దుబాయ్‌కు వలస వెళ్లి ఏవేవో కారణాలతో చనిపోతున్నారు. వారి మృతదేహాల కోసం కుటుంబ సభ్యులు రోజుల తరబడి ఎదురుచూస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి!

దుబాయ్ వలస మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. డబ్బులు సంపాదించడానికి వెళ్లి అక్కడ మృతి చెందటంతో ఆ కుటుంబాలు నేడు పూర్తిగా రోడ్డు మీదకు నెట్టి వేయబడ్డాయి. సంపాదన మాట అటుంచితే అక్కడ చనిపోయాక శవాన్ని తెప్పించేందుకు అప్పులు చేస్తూ పడరాని పాట్లు పడటం వర్ణనాతీతం అని చెప్పాలి. అలాంటి కుటుంబాలను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలి.


ఆందోళన చేస్తున్న కార్మికులు, మురళీధర్ యాదవ్

ఉద్యోగ భద్రత కల్పించే వరకు ఆందోళన

- పరిశ్రమ ప్రతినిధులతో చర్చలు విఫలం
- కార్మికులకు మురళీధర్ యాదవ్ మద్దతు

హత్నూర(సంగారెడ్డి): స్థానికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు తమ డిమాండ్లు పరిష్కరించే వరకు ఆందోళన విరమించేది లేదని బుధవారం రెండో రోజు కార్మికులు ఆందోళన కొనసాగించారు. హత్నూర మండలం బోరు పట్ల గ్రామ శివారులోని ఎపిటోరియా పరిశ్రమ యూనిట్ -1 వద్ద కార్మికులు, స్థానికులు నిరసన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నిరసనకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్ యాదవ్ మద్దతు తెలిపి, సంఘీభావంగా వారితో పాటు కూర్చున్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనలో బీజేపీ పూర్తిస్థాయి మద్దతు తెలుపుతుందన్నారు. ఎస్సై సుభాష్ జోక్యం చేసుకొని పరిశ్రమ ప్రతినిధులతో చర్చలు జరిపిస్తామని చెప్పడంతో మురళీ యాదవ్‌తోపాటు పలువురు పరిశ్రమ కార్మికులు చర్చలు జరిపారు. చర్చలు విఫలం కావడంతో తిరిగి ఆందోళన కొనసాగించారు. పరిశ్రమ హెచ్ఆర్ మేనేజర్ అశ్విని కుమార్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని చెప్పినా, ఎప్పుడు చేస్తారో టైం చెప్పాలని డిమాండ్ చేశారు. నిరసనలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు నాగప్రభు గౌడ్, పార్టీ నియోజకవర్గ కో కన్వీనర్ సతీష్ యాదవ్, నాయకులు మల్లారెడ్డి, లాకర్ కమలాకర్, దండు సతీష్, శ్రీకాంత్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న యువకులు అరెస్ట్


నిందితులను చూపుతున్న పోలీసులు

సిద్దిపేటఅర్బన్: గంజాయిని తరలిస్తున్న యువకులను పట్టుకొని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ బుధవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. అర్బన్ మండలం పొన్నాల గ్రామం నుంచి సిద్దిపేటకు కొంత మంది యువకులు గంజాయి విక్రయించేందుకు వస్తున్నారని మంగళవారం సాయంత్రం పోలీసులకు సమాచారం అందింది. త్రీటౌన్ ఎస్సై చంద్రయ్య సిబ్బందితో కలిసి ఇందూరు ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. నలుగురు యువకులు పోలీసులను చూసి పారిపోయేందుకు పట్టుకొని తనిఖీ చేయగా రూ.1,250 విలువ గల 50 గ్రాముల గంజాయి లభించింది. వీరిలో పొన్నాల టీహెచ్ఆర్ నగర్‌కు చెందిన నాచారం సాయికుమార్, పొన్నాలకు చెందిన కోటగల్ల ఆదర్శ్, కొండపాక మండలం దుద్దెడకు చెందిన తలారి రాకేశ్, దయ్యాల శ్రీకాంత్ పోలీసులకు పట్టుబడ్డారు. చేర్యాల మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన దండు రాజేశ్, నంగునూరు మండలం రాంపూర్ గ్రామానికి చెందిన గంగుల గణేశ్, అర్బన్ మండలం మిట్టపల్లికి చెందిన ప్రణయ్, కోహెడ మండలం జ్యోతిరావుతండాకు చెందిన బూక్యా అనిల్ పరారీలో ఉన్నారు. పట్టుబడిన వారి వద్ద నుంచి రెండు బైకులు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న వారిని త్వరలో పట్టుకుంటామని సీఐ విద్యాసాగర్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


బీరువా పగులగొట్టిన దొంగలు


చిందరవందరగా పడిన సామగ్రి

హవేళిఘణాపూర్(మెదక్): తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన మండల పరిధిలోని పోచమ్మరాళ్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన గుగ్లోత్ విఠల్ ఇంటికి తాళం వేసి మంగళవారం బంధువుల వద్దకు వెళ్లారు. ఈ విషయాన్ని గమనించిన దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని నాలుగు తులాల బంగారం, 10 తులాల వెండి, రూ.7,800 నగదు ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సత్యనారాయణ క్లూస్‌టీమ్‌తో సందర్శించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దుర్గామాత ఆలయంలో..

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని కొర్విపల్లి దుర్గామాత ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బుధవారం ఉదయం ఆలయ పూజారి గుడి వద్దకు వెళ్లగా తాళం పగులగొట్టి ఉందని, పూజ సామగ్రి చిందరవందరగా ఉందని పోలీస్‌లకు సమాచారం అందించారు. పోలీస్‌లు వచ్చి పరిశీలించగా అమ్మ వారి వెండి కిరీటం, శటగోపం, పల్లాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. చిన్నశంకరంపేట పోలీస్‌లు, మెదక్ పోలీస్ క్లూస్ టీమ్ సభ్యులు ఆధారాలను సేకరించారు.

నేషనల్ ఎక్సలెన్సీ అవార్డుకు 'వెంకటరాజు' ఎంపిక



కొల్చారం(నర్సాపూర్): సంగాయిపేట గ్రామ వాసి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు బీ.వెంకటరాజు 2024 ఏడాదికి గాను నేషనల్ ఎక్సలెన్సీ అవార్డుకు ఎంపికైనట్లు బుధవారం ఆయన సాక్షితో తెలిపారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 135 జయంతి, ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని 'కలాం విజన్ ఫౌండేషన్ తిరుపతి 'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 179 మందిని ఈ అవార్డుకు ఎంపిక చేశారు. 14న తిరుపతిలోని మేఘదూత్ ఆడిటోరియంలో రాధాకృష్ణన్ మనవడు చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోనున్నారు. విద్యా, సామాజిక, ఆధ్యాత్మిక, సేవ క్షేత్రంలో పనిచేసే వారికి ఈ అవార్డు ఇస్తున్నారు. ప్రస్తుతం వెంకటరాజు కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం మాల్ తుమ్మెదలో గెజిటెడ్ హెడ్మాస్టర్‌గా సేవలందిస్తున్నారు. వెంకటరాజుకు మండలంలోని విద్యావేత్తలు, వివిధ రంగాలకు చెందిన వారు అభినందనలు తెలియజేశారు.

యువకుడి మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్: నీటి గుంతలో యువకుడి మృతదేహం లభ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ అభిమాన్ సింగ్ కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ టీడీఎఫ్ కాలనీ పక్కన సృజన హోమ్స్ గుడ్ టైం బిల్డర్స్ చేపడుతున్న నిర్మాణం వద్ద నీటి గుంతలో గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యమైంది. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం మొత్తం ఉబ్బి పోయి గుర్తు పట్టలేని స్థితిలో ఉందన్నారు. చేతి పై మా(షా) అనే పచ్చబొట్టు ఉండటాన్ని గుర్తించారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే, ఎవరైనా గుర్తు పడితే పటాన్‌చెరు పోలీసులను సంప్రదించాలన్నారు.

తప్పిపోయిన వృద్ధురాలు శవమై..

మద్దూరు(హుస్నాబాద్): రెండు నెలల కిందట అదృశ్యమైన వృద్ధురాలు బావిలో శవమై తేలిన ఘటన మండలంలోని రేబర్తి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ షేక్ మహబూబ్ కథనం మేరకు.. రేబర్తి గ్రామానికి చెందిన గొట్టపు నర్సమ్మ(80) జూలై 24 న ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైంది. అప్పటి నుంచి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతుకుతున్నా దొరక్కపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే బుధవారం గ్రామంలోని వంగపల్లి రోడ్డులో గల కొంగర మల్లారెడ్డి అనే రైతు వ్యవసాయ బావిలో శవం ఉన్నట్లు గ్రామస్తులు గుర్తించి పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆ మృతదేహం నర్సమ్మదిగా కుటుంబ సభ్యులు గుర్తించారు.

కుల బహిష్కరణపై గ్రామస్తులకు కౌన్సిలింగ్


కౌన్సిలింగ్ ఇస్తున్న అధికారులు

మనోహరాబాద్(తూప్రాన్): కులం కట్టుబాట్లు పాటించకుంటే కులం నుంచి బహిష్కరిస్తామన్న కులస్తులకు, గ్రామస్తులకు బుధవారం తూప్రాన్ సీఐ రంగకృష్ణ కౌన్సిలింగ్ ఇచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం మనోహరాబాద్ మండలంలోని గౌతోజీగూడెం గ్రామానికి చెందిన గ్రామ ఎస్సీ కులస్తులు, పెద్దలు అదే గ్రామానికి చెంది పంచమి శంకరయ్య కుమారులు చంద్రం, అర్జున్‌లు శుభ, అశుభకార్యాలకు డప్పు కొట్టడం లేదని పంచాయతీ నిర్వహించారు. ఈ విషయంలో చంద్రం, అర్జున్‌లు తమకు డప్పు కొడితే వేరే ఉపాధి పనులు లేకుండా పోతుందని, అందుకే డప్పు కొట్టమని సమాధానం ఇచ్చారు. దీంతో మిమ్ములను కులం నుంచి దూరం పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ విషయమై అర్జున్ ఎక్స్(ట్విట్టర్)లో మెదక్ ఎస్పీకి తాము డప్పు కొట్టకుంటే కులం నుంచి బహిస్కరిస్తామని గ్రామ కులస్తులు బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై బుధవారం మనోహరాబాద్ తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీఓ వెంకటేశ్వర్లు, తూప్రాన్ సీఐ రంగాకృష్ణ, ఎస్ఐ సుభాష్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో గ్రామస్తులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. కాలం మారుతున్నందున ఇలాంటి పోకడలు ఉండొద్దని, కాలానికి అనుగుణంగా వ్యవహరించాలని, ఎదుటివారి హక్కులు హరించొద్దని, ఇలాంటి చర్యలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కౌశిక, ఆర్ఐ దీక్షిత్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మెహ్తాబ్ బేగం మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, మాజీ ఉప సర్పంచ్ రేణుకుమార్ పాల్గొన్నారు.


పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు అందజేత


ఫోన్లు అందజేస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను నూతన టెక్నాలజీ ద్వారా గుర్తించి బాధితులకు అందజేసినట్లు సీపీ అనురాధ తెలిపారు. కొద్ది రోజులుగా పలువురు తమ సెల్‌ఫోన్‌లను పోగొట్టుకొని సంబంధిత పోలీసు స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు. పోలీసులు సీఈఐఆర్ యాప్ నూతన టెక్నాలజీ సాయంతో ఫోన్లను గుర్తించారు. 80 మంది బాధితులకు బుధవారం సీపీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎవరైనా సెల్‌ఫోన్‌లు పోగొట్టుకుంటే సంబంధిత పీఎస్‌లలో ఫిర్యాదు చేయడంతోపాటు సీఈఐఆర్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు.

అనారోగ్యంతో తుమ్మ గాలయ్య మృతి

ఆరు దశాబ్దాలుగా చేనేత వృత్తి



గాలయ్య (ఫైల్)


సిద్దిపేటజోన్: కనుమరుగవుతున్న పట్టు పీతాంబరానికి పూర్వ వైభవం తెచ్చేలా సిద్దిపేట ప్రాంతంలో చీరలను నేయించి అందుబాటులోకి తెచ్చిన చేనేత కార్మికుడు, మాస్టర్ వీవర్ తుమ్మ గాలయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. గాలయ్య 60 ఏళ్లుగా సిద్దిపేట ప్రాంతంలో చేనేత కార్మికుడిగా వృత్తిలో సాగుతున్నారు. కొంతకాలంగా మాస్టర్ వీవర్‌గా సుమారు 25 మంది చేనేత కార్మికులకు ఉపాధిని అందిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన గొల్లభామ చీరలను తయారీ చేయించి. దేశవిదేశాల్లో ఆన్‌లైన్ ద్వారా విక్రయాలు సాగించారు. తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా గొల్లభామ చీరల తయారు చేసే వ్యక్తిగా గుర్తింపు పొందారు. అదే విధంగా మరుగున పడిపోయిన పట్టు పితంబరానికి మళ్లీ పూర్వవైభవం తెచ్చేలా గాలయ్య స్థానికంగా చేనేత కార్మికులతో పట్టు పీతాంబర చీరలను నేయించేవాడు. ప్రముఖ సినీ నటి, చేనేత బ్రాండ్ అంబాసిడర్ సమంత, చేనేత జౌళి శాఖ కమిషనర్ శైలజ రామయ్యర్, ఐఏఎస్ అలుగు వర్షిణితో పాటు చేనేత శాఖ అధికారులు మాస్టర్ వీవర్ గాలయ్య వద్ద తయారీ అయిన గొల్లభామ చీరలను తిలకించారు.

చేనేత రంగానికి లోటు...

సిద్దిపేట బ్రాండ్ గొల్లభామ చీర. అలాంటి చీరలను ప్రపంచ వ్యాప్తంగా ఆన్‌లైన్ ద్వారా పరిచయం చేసిన గాలయ్య మరణం పరోక్షంగా చేనేత రంగానికి తీరని లోటు అని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గాలయ్య కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు.

స్కూటీపై నుంచి పడి వ్యక్తి మృతి


సాయికిరణ్ (ఫైల్)


ప్రమాదంలో దెబ్బతిన్న కార్లు

అల్లాదుర్గం(మెదక్): ప్రమాదవశాత్తు స్కూటీపై నుంచి పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంపూర్ గ్రామ శివారులో 161 జాతీయ రహదారిపై బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జోగిపేట గ్రామానికి చెందిన సాయికిరణ్(28) పెద్దశంకరంపేట నుంచి జోగిపేటకు స్కూటీపై వెళ్తున్నాడు. రాంపూర్ శివారులో అదుపుతప్పి స్కూటీతో పాటు కిందపడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే జోగిపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడు వట్‌పల్లి ఉపాధిహామీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి చెప్పారు.

మరో ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన కుకునూరుపల్లి మండలంలోని మేదినీపూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మేదినీపూర్ శివారులో రాజీవ్ రహదారికి ఆనుకొని టిఫిన్ సెంటరు, మెస్ హోటల్‌ను ఏర్పాటు చేశారు. దీంతో వాహనదారులు రోడ్డు పక్కనే పార్కింగ్ చేస్తూ హోటల్‌కు వెళ్తున్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి కారులో కొమురవెల్లి మల్లన్నను దర్శించుకునేందుకు మల్లేశ్, మహేశ్, పర్వతాలు కలిసి వెళ్తున్నారు. ముందు వెళ్తున్న మరో వాహనాన్ని ఓవర్ టెక్ చేయబోయి హోటల్ ఎదుట పార్కు చేసిన మరో కారును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు దెబ్బతినగా ముగ్గురికి గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న 108 అంబులెన్సు సిబ్బంది క్షతగాత్రులను గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కక్ష తీర్చుకోవడానికే హైడ్రా

- కాంగ్రెస్ హయాంలోనే దుర్గం చెరువు ఆక్రమణ
- ఎంపీ డీకే అరుణ ధ్వజం


సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

జహీరాబాద్: హైడ్రా విషయంలో ప్రభుత్వం, అధికాయ యంత్రాంగం న్యాయంగా వ్యవహరించాలని జాయింట్ పార్లమెంట్ కమిటీ సభ్యురాలు, ఎంపీ డీకే అరుణ అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. చెరువులో కట్టినవన్నీ కూల్చాలని, కొన్ని కూల్చి కొన్ని వదిలేయడం సరైంది కాదన్నారు. కాంగ్రెస్ హయాంలోనే దుర్గం చెరువు ఆక్రమణకు గురయిందని ఆరోపించారు. మరి అప్పుడు ఎందుకు ఆపలేదని ప్రశ్నించారు. కొందరిని లక్ష్యంగా పెట్టుకుని హైడ్రాను ప్రయోగిస్తున్నారని మండిపడ్డారు. కక్ష తీర్చుకున్నాక ఎవరివి కూలగొట్టం అంటున్నారని విమర్శించారు. కట్టే వారివి మాత్రమే కూల్చుతామంటున్నారని విమర్శించారు. ముందే ఎందుకు నోటీసులు ఇవ్వలేదని ప్రశ్నించారు. నగరంలో అక్రమంగా కట్టిన కట్టడాలపై నోటీసులు ఇచ్చి వారి సమాధానం వచ్చాకే చర్యలకు దిగాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేయలేక ప్రజల దృష్టిని మళ్లించేందుకే హైడ్రా తెచ్చాడని, నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగబోతున్నందున ఆయా రాష్ట్రాల ఎన్నికలకు డబ్బు పంపేందుకే హైడ్ర వచ్చిందా అనే ప్రచారం ప్రజల్లో బహిరంగంగా జరుగుతున్నదన్నారు. గతంలో కేసీఆర్ కూల్చివేతలు చేపడితే నోటీసులు ఇచ్చి కూలగొట్టాలని అప్పట్లో రేవంత్‌రెడ్డియే మాట్లాడారనే విషయాన్ని గుర్తు చేశారు. ఏదైనా ఉంటే రెగ్యులరైజ్ చేయాలని, దాని ద్వారా ప్రభుత్వ ఖజానా నిండుతుందని అప్పట్లో మాట్లాడారన్నారు.

దేశ గౌరవం తగ్గేలా రాహుల్ మాటలు

రాహుల్‌గాంధీ భారత దేశ గౌరవం తగ్గించే విధంగా మాట్లాడుతున్నాడని, ఇది ఆయనకు సర్వసాధారమైందని డీకే అరుణ అన్నారు. రాహుల్ గాంధీ భారతీయుడిని అనుకుంటున్నాడా లేక ఇతర దేశస్తుడు అనుకుంటున్నాడా అనేది తెలియాలన్నారు. ప్రతీసారి విదేశాలకు వెళ్లి భారత దేశాన్ని ఎందుకు అవమానిస్తున్నాడని ప్రశ్నించారు. దేశ ప్రధానిని అవమానిస్తున్నాడంటే దేశాన్ని అవమానించినట్లే అవుతుందన్నారు. ఎన్నికల నిర్వహణపై తప్పు పట్టడం తగదన్నారు. ఎన్నికల ప్రక్రియ సక్రమంగా జరగకుంటే కర్ణాటక, తెలంగాణలో ఎలా అధికారంలోకి వచ్చారని ప్రశ్నించారు.